
# కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ పదిలం

- రాష్ట్రంలో మరింత సంక్షేమం, అభివృద్ధి జరుగుతుంది..
- రేవంత్‌రెడ్డి చంద్రబాబుకు శిష్యుడు
- కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని ఢిల్లీకి తాకట్టుపెట్టుడే
- బాల్కొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- భీమ్‌గల్, ముప్కాల్ మండలాల్లో ఎన్నికల ప్రచారం


జాగిర్యాల్‌లో వేములకు బోనాలు, మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు


కుప్కల్‌లో వేములకు బొట్టు పెడుతున్న మహిళ

భీమ్‌గల్, నవంబర్ 19: తెలంగాణ సీఎం కేసీఆర్ చేతుల్లోనే పదిలంగా ఉంటుందని, రాష్ట్రంలో మరింత సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని బాల్కొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే అని పేర్కొన్నారు. ఆదివారం ఆయన భీమ్‌గల్, ముప్కాల్ మండలాల్లో పర్యటించారు. భీమ్‌గల్ మండలంలోని సుదర్శన్‌నగర్ తండా, సంతోష్‌నగర్ తండా, జాగిర్యాల్, కుప్కల్, కుప్కల్ తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో వేములకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ.. చావునోట్లో తలపెట్టి కేసీఆర్ సాధించిన తెలంగాణ ఏర్పాటును తల్లిని చంపి బిడ్డను బతికించారని ప్రధాని మోదీ పార్లమెంట్ సాక్షిగా తెలంగాణపై విషం కక్కారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే తానే సీఎం అని చెప్పుకుంటున్న కిషన్‌రెడ్డి ..ఆనాడు తెలంగాణ ఉద్యమం కోసం రాజీనామా చేయాలని అడిగితే పారిపోయాడని ఎద్దేవా చేశారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చంద్రబాబు శిష్యుడని అన్నారు. కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే ఢిల్లీకి, బీజేపీకి అధికారం అప్పగిస్తే గుజరాత్‌కు తెలంగాణను అప్పగిస్తారని అన్నారు. అదానీ, అంబానీలు వచ్చి మన భూములు లాక్కుంటారని హెచ్చరించారు. తెలంగాణ పచ్చగా మారి ఇక్కడి ప్రజలంతా బాగు పడుతున్న సందర్భాన్ని కొన్ని శక్తులు చూడలేకపోతున్నాయని మండిపడ్డారు. వరిధాన్యం సాగులో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో తెలంగాణ ఉందని, గతంలో ఆంధ్ర ఉండేదన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో తాను వేయించిన డబుల్ రోడ్లను దండిగా పండిన ధాన్యంతో కల్లాలుగా వాడుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ఇలా పచ్చగా ఉందనే వారికి కళ్లు మండుతున్నాయన్నారు. గిరిజన తండాలకు సైతం రోడ్లు వేయించానని ఎక్కడా లేని విధంగా కోటి రూపాయలతో తీజ్ భవనాలు, సేవాలాల్ ఆలయాలకు నిధులు మంజూరుచేసినట్లు తెలిపారు. తనను మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రచార కార్యక్రమంలో ఎంపీపీ మహేశ్, కమ్మర్‌పల్లి ఏఎంసీ చైర్మన్ గుణ్‌వీర్ రెడ్డి, జడ్పీటీసీ రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు కన్నె సురేందర్, మండల కన్వీనర్ శర్మనాయక్, భీమ్‌గల్ విండో చైర్మన్ నర్సయ్య, సర్పంచులు ఎంజీ నాయక్, శ్రీనివాస్, ఎంపీటీసీలు రాజేశ్వర్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు భీమ్‌గల్ మండలంలో ఎన్నికల ప్రచారం

వేల్పూర్, నవంబర్ 19 : మంత్రి వేముల సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు భీమ్‌గల్ మండలం సికింద్రాపూర్, తండా, 11 గంటలకు గోన్‌గొప్పులు, తండా, సాయంత్రం 4 గంటలకు లింగాపూర్, 5 గంటలకు సిద్ధపల్లి, 6 గంటలకు బెజ్జొరా, 7.30 గంటకు ముచ్కూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.

## కాంగ్రెస్ వస్తే మళ్లీ చీకట్లే..

ముప్కాల్, నవంబర్ 19 : కరెంటు ఇవ్వని కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లీ నాటి చీకటి రోజులు వస్తాయని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ముప్కాల్ మండలం వెంచిర్యాల్, రెంజర్ల గ్రామాల్లో ఆదివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. 70 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలు ప్రజలకు చేసిందేమీలేదన్నారు. మహిళల తాగు నీటి కష్టాలు తీర్చే ఆలోచన చేయలేదన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ కేవలం నాలుగున్నర సంవత్సరాల్లోనే మిషన భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా ఏర్పాటు చేసి తాగు నీరు, కోతలు లేని కరెంటును అందించారని తెలిపారు. ఓటు వేసే ముందు ఇలాంటి విషయాలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటక, బీజేపీ అధికారంలో ఉన్న మహారాష్ట్రలో తెలంగాణ పథకాలు లేవన్నారు. ఇక్కడ ఆ పార్టీలు హామీ ఇస్తున్న పలు పథకాలు కర్ణాటక, మహారాష్ట్రలో లేవన్నారు. అక్కడ అమలు చేయని పథకాలు ఇక్కడ అమలు చేస్తామంటే ఎలా నమ్ముతామన్నారు.


వెంచిర్యాలలో మాట్లాడుతున్న మంత్రి వేముల

# ముమ్మరంగా బీఆర్‌ఎస్ ప్రచారం


మోర్తాడ్ మండలం పాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బాల్కొండ/ మోర్తాడ్/మెండోరా, నవంబర్ 19: బాల్కొండ మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మోర్తాడ్ మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రచారం ముమ్మరంగా సాగుతుంది. ఆదివారం అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారకార్యక్రమాలను నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమం కోసం తిరిగి మంత్రి ప్రశాంత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మెండోరా మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కారు గుర్తుకే ఓటు వేసి వేముల ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో జడ్పీటీసీ తలారి గంగాధర్, సర్పంచులు గోలి ప్రకాశ్, మిస్బా, పసుల శ్రీనివాస్, ఎంపీటీసీలు దేవేందర్, జాన్‌బాబు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు.


బాల్కొండలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


మెండోరా మండలం దూద్‌గాంలో ..

## డాక్టర్ మధుశేఖర్‌కు సన్మానం


డాక్టర్ మధు శేఖర్‌ను సన్మానిస్తున్న ఎస్సీ సంఘాల సభ్యులు

ఏర్గట్ల, నవంబర్ 19: ఏర్గట్ల మండల కేంద్రంలో ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధు శేఖర్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నేపథ్యంలో ఏర్గట్లకు వచ్చిన సందర్భంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుశేఖర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

## గ్రామ దేవతలకు జలాభిషేకం


గ్రామ దేవతలకు గోదావరి జలాలతో అభిషేకం చేస్తున్న మహిళలు

ముప్కాల్, నవంబర్ 19 : మండలంలోని రెంజర్ల గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో గ్రామదేవతలకు ఆదివారం జలాభిషేకం నిర్వహించారు. గోదావరి నది ఒడ్డు నుంచి తెచ్చిన నీళ్లతో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి, నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామస్తులు సహపంక్తి భోజనాలు చేశారు. ప్రతి ఏటా గ్రామ దేవతలకు గంగనీళ్లతో జలాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు.